క్లుప్తంగా

ఘనంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీలో ఆదివారం రాములోరి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య సందడిగా స్వామివారు పురవీధులలో ఊరేగారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ట పూజల్లో కొరముట్ల



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కొరముట్ల

ఓబులవారిపల్లె : బొమ్మవరం గ్రామంలోని శ్రీ పర్వతవర్ధినీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయంలో పునఃప్రతిష్ట, పూర్వకుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమాన్ని నాలుగు రోజులపాటు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్తులు వైస్ ఎంపీపీ గూడూరు గౌరీశంకర్‌రాజు, సర్పంచ్ లౌడి గంగరాజు ఆహ్వానం మేరకు కొరముట్ల స్వామి వారిని దర్శించి, తీర్థప్రసాదాలను పొందారు. కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివారెడ్డి, చెన్నరాజుపోడు సర్పంచ్ సుంకేసుల రఫీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం



ఈత మట్టలు పట్టుకొని పురవీధులు తిరుగుతున్న క్రైస్తవులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేటలోని గ్రేస్ ప్రార్థనా మందిరంలో మట్టల ఆదివారంను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ యోహాను మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువలో చనిపోక ముందటి ఆదివారం యూదుల రాజుగా గాడిద మీద ఆయన్ను ఊరేగించారన్నారు. ఆ క్రమంలో అప్పటి ప్రజలు రోడ్ల వెంబడి ఈత మట్టలు పరిచి వాటిమీద వస్త్రములను పరిచి యూదుల రాజుకు హోసన్నా అని కీర్తిస్తూ ఊరేగించినట్టు పేర్కొన్నారు. ఆ విధంగానే గ్రేస్ ప్రార్థనా మందిరం క్రైస్తవులు అందరూ ఈత మట్టలను చేతపట్టుకొని కీర్తనలు పాడుతూ గ్రామంలోని పురవీధుల గుండా మట్టలు పట్టుకొని తిరిగారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు చిన్నబాబు, ప్రసాద్, మహిళలు, సఘం సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

వీరబల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాయచోటికి చెందిన లక్ష్మీ మల్టీ స్పెషాలిటీ, శ్రీ నేత్రాలయ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు, వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో 250 మందికి వైద్య సేవలు అందించినట్టు లక్ష్మీ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ ఎండీ శివయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పవన్ కుమార్, బాల ప్రియాంక, శశి కుమార్ రెడ్డి, భరత్ కుమార్, దిలీప్ కుమార్, గౌరీ ప్రియ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందలూరు ఐకేపీఎస్ నేత మస్తానయ్య మృతి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైల్వే ఉద్యమ నేత, ఐకేపీఎస్ నాయకులు పోతురాజు మస్తానయ్య(55) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి మస్తానయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు గొబ్బిళ్ల త్రినాథ్, గుండు మల్లికార్జున రెడ్డి, అడ్వకేట్ షేక్, విజేయుడు, బూసిరెడ్డి రాజశేఖర్ రడ్డి, మధు యాదవ్, మధురాజు, మహబూబ్ బాషా, నాగేశ్వర్ రెడ్డి, శైల కుమార్, గడ్డం సుబ్బిరెడ్డి, బీజేపీ నాయకులు, జనసేన, టీడీపీ నాయకులు మస్తానయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

హే 'భగ'వాన్

- మండే ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి
- సుర్రుమంటున్న సూరీడు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఎండకు తాళలేక పుచ్చకాయ తింటున్న ప్రజలు

రాయచోటి జగదాంబసెంటర్ : సూర్యుడు ఉదయిస్తూనే సుర్రుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. 12 గంటలు దాటితే తారెత్తిస్తున్నాడు. భగభగమండే ఎండలతో బజారుల్లో కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించేలా ప్రభావం చూపిస్తున్నాడు. ఏప్రిల్ మొదటి వారం నుంచే రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఓ వైపు పండుగలు, వేడుకలు ఉండటంతో ప్రజలు బయటకు రావాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సి వస్తోంది.

బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం

'దేవుడా.. ఇవేమి ఎండలు'అనేలా భానుడు భగభగమంటున్నాడు. ఆకాశంలో నిప్పుల కుంపటి పెట్టినట్లుగా ఎండలు మండుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో రోజూ నిప్పుల వర్షం కురుస్తోంది. ఎండలు, వడగాల్పుల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతుడటంతో జనం విలవిలలాడుతున్నారు. ఏప్రిల్ చివరికి, మే నెలల్లో ఉష్ణోగ్రతలు ఏ స్థాయికి చేరుతాయోనని భయపడుతున్నారు. గతేడాది జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు ప్రస్తుతం ఎండలు పెరిగేందుకు కారణంగా తెలుస్తోంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండల తీవ్రత ఉన్నా సాయంత్రానికి అకాల వర్షాలు పడటం, గాలుల వల్ల కాస్త ఉపశమనం లభించేది. ఈసారి ఆకాశం నిర్మలంగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా నేలను తాకుతున్నాయి. ఇందువల్ల వడగాల్పుల తీవ్రత రెట్టింపు అవుతోంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు మండిపోతుండటంతో జనంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు.

ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి

ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇదే సమయంలో పండుగలు, వివాహాలు, శుభకార్యాలు ఉండటంతో షాపింగ్ సైతం పట్టణాలకు ఎండల్లోనే వెళ్లాల్సి వస్తోంది. బోరుబావుల కింద వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు తెల్లవారుజామున వెళ్లి ఉదయం 11 గంటలకు ఇళ్లకు చేరుతున్నారు.

పుంజుకున్న వ్యాపారం

ఎండలు అధికం కావడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల వైపు పరుగులు పెడుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా మజ్జిగ, లస్సీ, చెరుకు రసం, కూల్‌డ్రింక్స్ తదితర పానీయాలకు గిరాకీ కనిపిస్తోంది. చిన్నపిల్లలు ఐస్‌క్రీం, కూల్ డ్రింక్స్ తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో సీజనల్ పండ్లయినా కర్బూజ, కళింగర, తాటిముంజల కొనుగోలుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు.

వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి
- లేతవర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- రోజుకు 15 గ్లాసుల నీళ్లు తాగాలి
- పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి
- భోజనం మితంగా తీసుకోవాలి
- ఎండ వేళ ఇంటి పట్టున ఉండటం అన్ని విధాల శ్రేయస్కరం
- తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి తీసుకెళ్లాలి
- మాంసాహారాన్ని దాదాపు తగ్గించాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి





రాయచోటి పట్టణంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన కూడళ్లు

అప్రమత్తంగా ఉండాలి



వేసవికాలంలో ఎండలు తీవ్రతరం కావడంతో వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు అవసరమైతే తప్ప ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్లలో నుంచి బయటకు రావద్దు. వడదెబ్బకు గురైన వ్యక్తికి తక్షణమే వైద్య సేవలు అందించడం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చు.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, రాయచోటి

సిద్దవటం కోటను సందర్శించిన డిప్యూటీ సీఈఓ



తవ్వకాల్లో బయల్పడిన శివలింగాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

సిద్దవటం : మట్లి రాజుల కోటను ఆదివారం విజయవాడ సెక్రటేరియేట్‌లో డిప్యూటీ సీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కోటలోని కట్టడాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పురాతనమైన కోటలో శిల్ప సంపద అద్భుతంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని సిద్దవటం కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈయన వెంట వీఆర్‌ఓ కేశవులు, వీఆర్‌ఏ వెంకటేష్ ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

సిద్దవటం : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ హెచ్చరించారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇసుకను గృహ నిర్మాణాలకు మాత్రమే మండలంలోని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవలన్నారు. ఉచిత ఇసుక విధానం ముసుగులో పెన్నానదీ పరివాహక గ్రామాలైన మాచుపల్లె, టక్కోలు, డేగనవాండ్లపల్లె, లింగంపల్లె గ్రామాల నుంచి ట్రాక్టర్ ద్వారా కడపకు అక్రమ రవాణా జరుగుతునట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిఘా ఉంచి ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణ వేదికపై దర్శనమిస్తున్న సీతారామచంద్రులు



చిన్నమండెం: స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న డాక్టర్ చిన్నరెడ్డన్న దంపతులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సీతారాముల వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు బండాత్మకూరు శివ కుమార్ శర్మ, బనగానపల్లి సంతోష్ కృష్ణ శర్మల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును జరిపించారు. అలాగే అరవపల్లి ప్లే గ్రౌండ్ వద్ద సీతారాముల దేవస్థానం వద్ద సీతారాముల కల్యాణాన్ని అర్చకులు సరసా రవి కుమార్ నిర్వహించారు. ఈ కల్యాణానికి ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని వైఎస్సార్‌సీపీ మహిళా మండలి అధ్యక్షులు పల్లె మాధవి, మండల కో–ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్‌లు ఘనంగా సన్మానించారు. భక్తులు పెద్దఎత్తున కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కొత్తపల్లెలో కనుల పండువగా

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొత్తపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ సీతా రాముల ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. డాక్టర్ చిన్నరెడ్డన్న దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించగా సర్పంచ్ భూమసాని అంజలి పర్యవేక్షణలో రాములోరి కళ్యాణ క్రతువును ఆలయ అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలతో పాటు పానకం, వడపప్పును అందజేశారు.

ఆధ్యాత్మికత పెంపునకు ఆలయాలు దోహదం



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి : ఆధ్యాత్మికతను పెంపొందించడంలో ఆలయాలు ఎంతో దోహదం చేస్తాయని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వంగిమల పంచాయతీలో దుగ్గనపల్లిలో జరిగిన రామాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణిరాజు, అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ స్వామి, మాజీ కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్ బాషాలతో కలసి పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయించారు. రామయ్య చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ పటిష్టత సమష్టిగా పని చేద్దామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లోకేశ్వర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రమేష్ రెడ్డి, సర్పంచ్ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు తారకేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కంటి చూపుతో జీవితానికి వెలుగు



సంబేపల్లె: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



రామాపురం: రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

సంబేపల్లె : తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మోటకట్ల ఆలయాల వ్యవస్థాపకుడు కీ.శే. పి.వి.సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మోటకట్ల వంగిమళ్లవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పేదలకు కంటి చూపును ప్రసాదించడం, వారి జీవితానికి వెలుగునివ్వడం అని విశ్రాంత డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, అమరనాథ్‌రెడ్డిలు అన్నారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు ప్రియాంక, ఆకాంక్ష, సిబ్బంది కలసి 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 40 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేసేందుకు అరవింద్ ఆసుపత్రి, తిరుపతికి రెఫర్ చేసిన్నట్లు చెప్పారు.

600 మందికి వైద్య పరీక్షలు

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు పాఠశాల ఆవరణలో ఆదివారం కడపకు చెందిన నూరా అల్ ముబారక్ చారిటబుల్ ట్రస్టు, లైఫ్‌లైన్ ఆసుపత్రి వైద్యులు షేక్ రబ్బాని, షేక్ ఇలియాస్‌బాషా, పఠాన్ అజ్మతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో 600 మందికి వివిధ రకాల వ్యాధులు సంబంధించిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలకు సుమారు మండల పరిధిలోని గ్రామాల నుంచి వెయ్యి మందికిపైగా రోగులు హాజరై వైద్య పరీక్ష చేయించుకున్నారు. 600 మందికి రక్తపరీక్షలు, స్కానింగ్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు ఫరూక్, రామ్‌చరణ్‌రెడ్డి, హిమాంసాదిక్, ఆనంద్, సురేష్‌కుమార్‌లు వైద్య సేవలను అందించారు.

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో ఆదివారం శంకర్ నేత్రాలయ హాస్పిటల్, మిషన్ ఫర్ విజన్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, వీరిలో 32 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. వీరందరిని ఉచితంగా చెన్నైలోని శంకర్ నేత్రాలయ ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్, రవాణా సౌకర్యం, మందులు అంజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డైట్ ప్రాంగణంలో నిర్వహించిన కంటివైద్య శిబిరంలో 130 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు శ్రీలలిత, ప్రీతి, వైద్యబృందం ఆధ్వర్యంలో 130 మందికి పరీక్షలు జరిపారు. అందులో 47మందికి కంటి చికిత్సలు అవసరమైన వారికి తిరుపతికి తరలించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, కార్యదర్శి శశిశేఖర్, ట్రెజరర్ మహేష్‌రాజు, జిల్లా అధికారులు కూనా కృష్ణదేవరాయులు, పి.సురేష్, జోషి, రియాజుద్దీన్, ఖాదర్‌బాష, నరసింహా రెడ్డి, అష్రఫ్‌అలీ, మాజీ అధ్యక్షులు ఎస్.కె.హుస్సేన్, రెడ్డిశంకర్, సభ్యులు రూపేష్, నరసింహ, శరత్, ప్రకాష్, షబ్బీర్, షౌకత్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

రాణించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



పి.సాయి కీర్తన్

నందలూరు : ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన పరీక్షా ఫలితాలలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం గణిత విభాగం ఎంపీసీలో పి.సాయి కీర్తన్ 957 మార్కులతో అన్నమయ్య జిల్లాలో బాలురలో (ప్రభుత్వ కళాశాలల విభాగంలో) ప్రథమ స్థానాన్ని సాధించాడన్నారు. అలానే అంజలి 886, ఆజ్ఞ చక్రాంత్ 885, బైపీసీ విభాగంలో భావన 874, సునీత 840, సీఈసీలో ఎస్.సమీరా 835 మార్కులతో రాణించారన్నారు. అలాగే ప్రథమ సంవత్సరం ఫలితాలలో వై.మల్లీశ్వరి సీఈసీలో 500 మార్కులకు గాను 409 మార్కులు సాధించగా, ఎం.బంగారం బైపీసీలో 440 మార్కుకు గాను 348 మార్కులు సాధించడంతో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

కస్తూర్బా బాలికల గురుకులంలో వంద శాతం



గంగోత్రి

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సాయి దివ్య తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 38 మంది పరీక్ష రాయగా 38 మంది, ద్వితీయ సంవత్సరంలో 30 మంది పరీక్ష రాయగా 30 మంది పాసైనట్లు ఆమె తెలియజేశారు. బైపీసీ విభాగంలో గంగోత్రి 967, పూజిత 945, శ్రీలత 941 మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : మండుతున్న ఎండలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లా నూర్‌బాషా, దూదేకుల సంఘం కృషి చేస్తుండడం అభినందనీయమని నూర్‌బాషా, దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సిద్దయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయం వద్ద నూతనంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సంఘం నేతలతో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పగిడిపల్లె పకీర్ సాహెబ్, నేతలు కొండూరు మహమ్మద్ రఫీ, ఇనాయతుల్లా, సత్తార్, నాగరాజు, పాలగిరి దర్బార్‌బాషా, పీరుసాహెబ్, పకీర్‌సాహెబ్, చిలకల మహమ్మద్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునాల

తంబళ్లపల్లె : ఎర్రసానిపల్లె పంచాయతీ ఎగువ ముత్రవారిపల్లె వద్ద వెలసిన ఏటిగంగమ్మ తిరునాలను గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. పూజారి మదన్‌మోహన్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం



లక్కిరెడ్డిపల్లి: దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ



సుండుపల్లె: అలంకరణలో శ్రీ నాగారపమ్మ



చిన్నమండెం: పూజలందుకున్న మల్లూరమ్మ

లక్కిరెడ్డిపల్లి : రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా వర్షాలు కురిపించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ ఆలయానికి భక్తులు తరలిరావడంతో క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి భక్తులు వేచి ఉన్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వచ్చారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మను ఆదివారం ఉదయాన్నే పూజారులు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యా నదిపై కొలువైవున్న శ్రీ మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఘనంగా నడివీధి గంగమ్మ జాతర



సిద్దవటం: బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



పెనగలూరు: పొంగుబాలు పొంగిస్తున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామంలో కొలువైన నడివీధి గంగమ్మ జాతరను ఆదివారం స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి గుడిని పూలమాలలు, నిమ్మకాయలు, వేప మండలతో అలంకరించారు. అమ్మవారిని పసుపు, కుంకుమతో అలంకరణ చేశారు. స్థానిక మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారి గుడి చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. కోడిపుంజులు, మేక పోతులు బలిచ్చి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి పొంగుబాలు పెట్టుకొని చల్లబోసుకున్నారు. గ్రామంలో శ్రీరామ నవమి తిరునాల జరిపే ముందు గంగమ్మ జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆదివారం గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించి విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

లౌకిక రాజ్యస్థాపనే అంబేడ్కర్ లక్ష్యం



శ్రీకాంత్‌రెడ్డి



కొరముట్ల శ్రీనివాసులు

రాయచోటి టౌన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఆయన విలేకర్లకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. లౌకిక రాజ్య స్థాపనే లక్ష్యంగా బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాంగ బద్ధంగా హక్కులు కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, న్యాయశాస్త్ర నిపుణుడిగా, ఆర్థిక వేత్తగా, సామాజిక శాస్త్రజ్ఞుడిగా, శారిత్రకారుడిగా, రాజనీతి కోవిదుడిగా, నేటి తరానికి స్ఫూర్తిప్రదాతగా పేరుప్రఖ్యాతులు పొందారన్నారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకొన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అడుగుజాడల్లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నాడన్నారు. రాయచోటి పట్టణంలో గతంలో తాము అంబేడ్కర్, పూలే, తదితర విగ్రహాలను చిరస్థాయిగా నిలిచేలా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వారమతామని తెలియజేశారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పురస్కరించుకొని సోమవారం జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సోమవారం (నేడు) ఉదయం 8:30 గంటలకు పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే రోగులకు పాలు, పండ్లు పంపిణీతోపాటు అల్పాహార విందు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమాలలో నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై దాడి అమానుషం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై, కార్యాలయంపై కూటమి నాయకులే దాడులు చేయడం హేయమైన చర్య అని బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు పండుగోల మణి తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మాట్లాడుతూ కూటమి నాయకులలో ఏమైనా మన స్పర్థలు ఉంటే పార్టీ అధిష్ఠానం వద్ద తేల్చుకోవాలని, చేసుకోవడం సరికాదన్నారు. దళిత ఎమ్మెల్యే శ్రీధర్‌పై దాడి ప్రయత్నాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నట్టు చెప్పారు.